వరద వస్తే ముంపే

- శనివారపుపేట కాజ్‌వేపై రాకపోకలు నిలుపుదల
- ఏలూరు ప్రజలకు అవస్థలు
- కలగా వంతెన నిర్మాణం
- అమలుకాని కూటమి హామీ



శనివారపుపేట కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు వరద నీరు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మాణం ఏలూరు నగర ప్రజలకు కలగానే మిగిలిపోతుంది. ప్రజా ప్రతినిధులు వాగ్దానాలు ఇవ్వడం ఆ తర్వాత పట్టించుకోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే ఈ వంతెన నిర్మిస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి నేతలు ప్రజలకు హామీ ఇచ్చారు. ఇప్పుడు వంతెన నిర్మాణం ఊసే ఎత్తకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాలు, వరదల సమయంలో తమ్మిలేరు ఉధృతంగా ప్రవహించడం, కాజ్‌వేపై భారీ ఎత్తున వరద నీరు ప్రవహించడం, అధికారులు కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేయడం పరిపాటిగా మారింది. గత రెండు రోజులుగా తమ్మిలేరు ఉధృతంగా ప్రవహించడంతో శనివారపుపేట కాజ్‌వేపై వరద నీటి ప్రవాహం పోటెత్తడంతో రాకపోకలను నిలిపివేశారు. దీంతో ఏలూరు నగర, పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తమ ఇళ్లకు, గ్రామాలకు చుట్టూతిరిగి అధిక సమయం వెచ్చించి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాజ్‌వేపై వంతెన నిర్మాణ పనులు తక్షణం చేపట్టాలని ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యే హామీ ఏమైనట్టు?

శనివారపుపేట కాజ్‌వే స్థానంలో రూ.15 కోట్ల వ్యయంతో పై వంతెన నిర్మిస్తామని, త్వరలో పనులు ప్రారంబించనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఏడాది క్రితం ప్రకటించారు. గత వరదల్లో హామీ ఇచ్చారు. మళ్లీ వరదలు వచ్చాయి. ప్రజలు అవస్థలు తీరలేదు. వంతెన నిర్మిస్తామని చెప్పి దాదాపు ఏడాది కావస్తున్నా ఇంత వరకు పనుల్లో ఎటువంటి పురోగతి కన్పించడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

నిత్యం 50 వేల మంది రాకపోకలు

శనివారపుపేట కాజ్‌వేపై నుంచి తమ్మిలేరు అవతల ఉన్న శ్రీరామ్‌నగర్, గ్జేవియర్ నగర్, శనివారపుపేట, లునాని నగర్, దొండపాడు, శనివారపుపేట ప్రాంతాలతో పాటు దుగ్గిరాల, పినకడిమి కొప్పాక మీదుగా నూజివీడు ప్రాంతాలకు వెళుతుంటారు. దుగ్గిరాల డెంటల్ కాలేజ్, సెయింట్ ఆన్స్ కాలేజీ వంటి ప్రముఖ విద్యా సంస్థలకు వెళ్లాలన్నా ఇదే మార్గం. రోజుకు కనీసం 50 వేల మంది వరకు ఈ కాజ్ వే పై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. నూజివీడు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు కూడా ఇదే మార్గంలో వెళ్లివస్తుంటాయి. జాతీయ రహదారి నుంచి దుగ్గిరాల మీదుగా ఏలూరు నగరంలోకి వాహనచోదకులు ఇదే మార్గంలో వస్తుంటారు. ఇంతటి ప్రాముఖ్యత గల ఈ మార్గం తమ్మిలేరుకు వరద వచ్చినప్పుడల్లా రాకపోకలు నిలిపివేయడంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు.

నిర్మాణం చేపట్టాలి



తమ్మిలేరుకు వరద వచ్చిన ప్రతి సారీ శనివారపుపేట కాజ్‌వేపై పెద్ద ఎత్తున నీరు ప్రవహిస్తుంది. రాకపోకలను బంద్ చేసేస్తున్నారు. దీంతో శనివారపుపేటకు చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గత పదేళ్లగా శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మించాలని కోరుతునే ఉన్నాం. ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఇంతవరకు వంతెన నిర్మాణ పనులు చేపట్టకపోవడం విచారకరం.

– గొట్టాపు రవికిషోర్, మాజీ ఎంపీటీసీ, శనివారపు పేట, ఏలూరు

ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి



ఎంతో కాలంగా శనివారపుపేట కాజ్‌వే స్థానంలో పై వంతెన నిర్మించాలన్న ప్రజలు ఆకాంక్షను పాలకులు నెరవేర్చాలి. తమ్మిలేరు పొంగినప్పుడల్లా ఏలూరు నగరంలోకి వెళ్లేందుకు స్థానికులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. దుగ్గిరాల డెంటల్ కాలేజీకి వెళ్లే రోగులు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం ఏలూరు నగరంలోకి వచ్చి వెళ్లేందుకు ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

– కె.రామాంజనేయులు, సీపీఎం నగర కమిటీ సభ్యుడు, కట్టా సుబ్బారావు తోట, ఏలూరు

పనులు తక్షణం ప్రారంభించాలి



శనివారపుపేట కాజ్‌వే స్థానంలో పూర్తిస్థాయిలో వంతెన నిర్మించాలని ఏళ్ల తరబడి ప్రజలు కోరుతున్నారు. అయినా నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఏటా వర్షాకాలంలో తమ్మిలేరు ఉధృతి, వరద వచ్చినప్పుడు ఏలూరు నగరంలో మొదటిసారిగా ప్రభావం చూపేది ఈ కాజ్‌వే పైనే. పాలకులు హామీ ఇచ్చిన మేరకు తక్షణం కాజ్‌వే స్థానంలో పూర్తిస్థాయి వంతెన నిర్మాణం చేపట్టాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఏలూరు

క్లుప్తంగా

మహనీయుల స్మరణ అభినందనీయం



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): గురజాడ అప్పారావు 110వ వర్ధంతి, డాక్టర్ రాయప్రోలు సుబ్బారావు 130వ జయంతిని పురస్కరించుకుని పలు కళాశాలలు, పాఠశాలల్లో పోటీలు, సభలు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, న్యూ మ్యాంక్ కుంగ్ ఫు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు దేశానికి చాలా అవసరమని అలాంటి కృషిలో భాగంగా బోదకాలు, టైఫాయిడ్ వంటి జబ్బులను నయం చేసే టెట్రాసైక్లిన్ మందు కనిపెట్టిన డాక్టర్ యల్లప్రగడ సుబ్బారావు 130వ జయంతి కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో హేలాపురి బాలోత్సవం నాయకులు పి.ఆంజనేయులు, కొమ్మోజు శ్రీనివాసరావు, బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు, కుంగ్ ఫు ట్రైనర్ జి.రాఘవ, తానుకొండ రాజు ఉన్నారు.

సుంకాల పెంపుపై 6న నిరసన



మాట్లాడుతున్న వామపక్షాల నేతలు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): భారతీయ సరుకుల దిగుమతులపై ట్రంప్ సర్కార్ సుంకాన్ని 50 శాతానికి పెంచడాన్ని నిరసిస్తూ ఈనెల 6న వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. గురువారం స్థానిక సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో వామపక్షాల సమావేశం సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన నిర్వహించారు. కృష్ణ చైతన్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామకృష్ణ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావులు మాట్లాడారు. భారతీయ సరుకులపై 50 శాతం దిగుమతి సుంకాన్ని విధించడం వల్ల మన దేశీయ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఎగుమతులపై సుంకం పెంచి మరో వైపు అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులను పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలని షరతులు పెడుతుందని తెలిపారు. ట్రంప్ సర్కార్ భారత ప్రయోజనాలను, సార్వభౌమత్వానికి భంగం కలిగిస్తున్నా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నోరు మెదపకపోవడం గమనార్హమన్నారు. ఈ నెల 6న నిరసనలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్ జగన్ ఆశయ సాధనకు కృషి

ఏలూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త జేపీ



జయప్రకాష్‌కు మొక్క అందిస్తున్న స్రవంతి



జయప్రకాష్‌కి శుభాకాంక్షలు తెలిపిన రాజేశ్వరరావు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేద, మధ్యతరగతి వర్గాలు, మహిళలు, విద్యార్థులు, యువత, వ్యాపారులు ఇలా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం పరితపిస్తున్నారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తానని ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. పార్టీ ఏలూరు సమన్వయకర్తగా ఏడాది పూర్తైన సందర్భంగా జేపీని ఏలూరులోని పార్టీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా జేపీ ముఖ్యనేతలతో పార్టీ బలోపేతంపై చర్చించారు. జేపీని అభినందించిన వారిలో ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి, ఏలూరు మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, సీనియర్ నేత రమేష్, సీనియర్ నాయకులు అయ్యంకి రాజు, ఎచ్చర్ల ఉమామహేశ్వరరావు, ఏలూరు జిల్లా వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, వైఎస్సార్‌టీయూసీ ఏలూరు అధ్యక్షుడు ఘంటా రాజేశ్వరరావు, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గాజుల బాజీ, బీసీ సెల్ కార్యదర్శి బోగాది ప్రభాకర్, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు షేక్ షమీ, పులవర్తి డేవిడ్, ఘంటా రాజు, నాగరాజు, నాని, కిరణ్ తదితరులు ఉన్నారు.

6న చలో విజయవాడ

ఏలూరు(ఆర్ఆర్‌పేట): విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 6న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి కె.లెనిన్ తెలిపారు. ఈ మేరకు ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా విద్యారంగంలో అనేక సమస్యలు ఉన్నాయని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి యువగళం పాదయాత్రలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు డిగ్రీ కళాశాల వైపు కన్నెత్తి కూడా చూడలేదని ఆరోపించారు. ఈ కళాశాలకు అధికారంలోకి రాగానే నిధులు కేటాయిస్తామని విద్యార్థులకు మాటిచ్చారు. ఇప్పుడు కళాశాల వైపు కూడా చూడటం లేదని ఆరోపించారు. మీనాక్షి, రమ్య, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ ఆగ్రహం

చింతలపూడి: మండల పరిషత్ సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీపీ బాణావతు రాంబాబు నాయక్ ఆదేశించారు. చింతలపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ బి.రాంబాబు నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో అధికారుల గైర్హాజరుపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంపీపీ ఇకపై సమావేశాలకు గైర్హాజరు అయిన అధికారులపై చర్యలు ఉంటామని హెచ్చరించారు.

డీఎల్‌పీఓగా సుబ్బరాయన్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆకుల వెంకట సుబ్బరాయన్ డీఎల్‌పీఓగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆయనను జంగారెడ్డిగూడెం డీఎల్‌పీఓగా నియమిస్తూ రాష్ట్ర పంచాయితీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనతో పాటు జిల్లాలోని పలువురు డిప్యూటీ ఎంపీడీవోలు, ఎంపీడీవోలుగా పదోన్నతి పొందారు.

ప్రాణాలు తీస్తున్న పిడుగులు

- అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు
- వర్షాల సమయంలో చెట్ల కింద ఉండవద్దు




ఆకాశం మేఘావృతమైన దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వర్షాకాలంలో ఆకాశంలో మేఘాలు కమ్ముకురావడం, అక్కడి నుంచి ఉరుములు, ఆ పై పిడుగులు పడడం సాధారణం. ఈదురు గాలులు వీచి చెట్ల కొమ్మలు, రహదారుల పక్కన ఏర్పాటు చేసే హోర్డింగులు కూలి ప్రాణాపాయ పరిస్థితులు ఎదుర్కొన్న ఘటనలు అనేకం. ప్రతి వర్షాకాలంలో ఎక్కడో ఒక చోట పిడుగుపాటుకు మనుషులే కాదు మూగ జీవాలు సైతం మృత్యువాత పడడం కూడా వార్తల్లో చూస్తుంటాం. అవగాహన లేకపోవడం, అప్రమత్తం కాకపోవడం వల్లే అటువంటి ఘటనలు పునరావృతమౌతున్నాయని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన చిన్నపాటి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పాటు బంగాళా ఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనాల సందర్భాల్లో మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కూడా కురిశాయి. మరో మూడు రోజుల పాటు జిల్లాలో అల్పపీడన ప్రభావం ఉంటుందని, ఈ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

జాగ్రత్తలు ఇవీ..

- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసేటప్పుడు చెట్ల కింద ఉండకూడదు. రైతులు పొలాల్లో ఉండకుండా ఇళ్లకు చేరుకోవాలి.
- వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలకు దూరంగా ఉండాలి.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే పొలాల్లో రైతులు, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు ఉండరాదు.
- మెరుపులు కనిపించినప్పుడు అరచేతులతో చెవులు మూసుకొని, నేలపై మోకాళ్లపై కూర్చొని తల కిందకు వంచి ఉండాలి. ఆ సమయంలో విద్యుత్, ఎలక్ట్రానిక్ పరికరాలు వాడరాదు.
- కాంక్రీట్ నేలపై పడుకోవడం, గోడకు అనుకోవడం చేయరాదు.
- ఇనుము తలుపులు, పైపులను తాక కూడదు.
- మెరుపు కనిపించిన తర్వాత 30 సెకన్లలో లేదా అంతకన్న తక్కువ సమయంలో 10 కిలో మీటర్ల దూరంలోపు పిడుగు పడే అవకాశం ఉంది.
- మెరుపు కనపడిన తర్వాత 30 నిమిషాల పాటు బయటకు వెళ్లే ప్రయత్నం చేయవద్దు.
- గొడుగులపై లోహపు బోల్టులు, చేతుల్లో సెల్ ఫోన్లు లేకుండా చూసుకోవాలి. సెల్‌ఫోన్ ఉంటే ఆ సమయంలో స్విచ్చాఫ్ చేసుకోవాలి. ఒక వేళ అవి ఉంటే రేడియేషన్ తరంగాలకు గురై ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది.
- వర్షం పడే సమయంలో విద్యుత్ తీగలు కింద ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. ఆ సమయంలో చెప్పులు లేకుండా బయటకు వెళ్లరాదు.
- గుండె సంబంధిత వ్యాధులు ఉన్న వారు మెరుపు, ఉరుములతో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

10 వేలవాట్లకు పైగా శక్తి ఉంటుంది



మేఘాల్లో విద్యుత్ ఆవేశం ఉత్పన్నమైన కారణంగా పిడుగులు సంభవిస్తాయి. పిడుగు శక్తి 10 వేల వాట్లకు పైగా ఉంటుంది. పిడుగుకు భూమి ఆకర్షణ శక్తి ఎక్కువ. ఎత్తైన భవనాలు, సెల్ టవర్లు, చెట్లపైనే ఎక్కువగా పిడుగులు పడతాయి. పిడుగుపాటుకు గురైన వ్యక్తిని వెంటనే పొడి ప్రదేశంలో తిన్నగా పడుకోబెట్టాలి. తడి బట్టలు తీసేయాలి. తలను ఒక పక్కకు తిప్పాలి. రెండు కాళ్లను ఒక అడుగుపైకి ఎత్తాలి. గాలి తగిలే ప్రదేశంలో ఉంచి అవసరమైతే నోటి ద్వారా గాలి ఊది ప్రథమ చికిత్స చేయాలి. వర్షం వస్తుందనిపించే సమయంలో ప్రజలు బయటకు వెళ్లకుండా ఉండాలి. అప్రమత్తంగా ఉంటే ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు.

– డాక్టర్ సింగర శ్రీకృష్ణ చైతన్య, జియాలజీ హెచ్ఓడీ, సీఆర్ఆర్ కళాశాల

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	48	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	00	బీళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	36
బెండకాయలు	24	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	44	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	38
బీరకాయలు	36	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	70-90
క్యారెట్	42	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	18	చుక్కకూర	10
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	20-26	పుదీనా	05
ఆనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	24
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	రద్దు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	33
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	36
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	32
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

జ్వరాలను అరికట్టాలని ధర్నా

కుక్కునూరు: మండలంలోని పలు గ్రామాల్లో విజృంభిస్తున్న టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలను అరికట్టాలని కోరుతూ గురువారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు షేక్ గౌస్ మాట్లాడుతూ కుక్కునూరు పీహెచ్‌సీ పరిధిలో అనేక గ్రామాల్లో విపరీతంగా దోమల బెడద ఉందన్నారు. వాటి నివారణ విషయమై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ధర్నాలో జంగారెడ్డిగూడెం డివిజన్ మండల కార్యదర్శులు సోయం చందర్‌రావు, కంగాల కల్లయ్య, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి షేక్ మున్ని, సున్నం రాణి,మండల నాయకులు మడివి అదెయ్య, ఎం.వెంకటేశ్వర్లు, రమేష్, మడివి దేవయ్య, మడివి మహేష్, మడివి రాజు, మడివి మంగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

యూరియా నిల్వల తనిఖీ



యూరియా నిల్వలను తనిఖీ చేస్తున్న ఎస్పీ శివ కిషోర్

దెందులూరు: రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయాలని జిల్లా ఎస్పీ కె.ప్రతాప శివకిషోర్ ఆదేశించారు. రైతుల నుంచి యూరియా సరఫరా పంపిణీకి సంబంధించి ఫిర్యాదులు రాకూడదన్నారు. వ్యవసాయ శాఖ ఉద్యోగులు రైతులతో మమేకమై సాగుకు ఇబ్బందులు తలెత్తకుండా విధులు నిర్వహించాలన్నారు. పెరుగ్గూడెం కో-ఆపరేటివ్ సొసైటీ గోడౌన్‌లోని యూరియా నిల్వలను గురువారం జిల్లా ఎస్పీ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్‌బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీతంపేట కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరాజు మాట్లాడుతూ మండలానికి 100 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో పంపిణీ చేస్తామన్నారు. గోడౌన్‌లో యూరియా బస్తాలు రికార్డులు ఎస్పీ తనిఖీ చేశారు. విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏలూరు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ పాల్గొన్నారు.